

# ధారలుగా కారిన రక్తం వరదలుగా కారిన కన్నీళ్ళు

## – కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

16

"కూర్చోండి! అవును. నేను ఎన్ని మాటలు చెప్పినా మీ శోకం తీరదు. మీ కళ్ళవెంట ధారలు కారే కన్నీళ్ళు ఎవరూ ఆపలేరు. ఇరవైనాలుగు గంటలలో కుమార్తెనీ, భర్తనీ పోగొట్టుకున్న" అన్నాడు యుగంధర్.

కనకమ్మ వెక్కి వెక్కి ఏడుస్తూ, "పాపిష్టిదాన్ని ఆ రాజ్యలక్ష్మి యింటికి వెళ్ళకుండా ఇంట్లో వుండి వుంటే"

"ఉంటే మిమ్మల్నీ హత్యచేసేవారు" అన్నాడు యుగంధర్.

కనకమ్మ అదిరిపడింది. "ఎందుకు?" అడిగింది.

"దానికి సమాధానం మీనుంచి వస్తుందనే ఆశ. సుమిత్ర, జయశ్రీల హత్య గురించి మీకు కొంత తెలిసి వుండాలి. అలాగే పుండరీకాక్షయ్య"

"నాకేమీ తెలియదు" కనకమ్మ అన్నది.

"మీ కుమార్తెనీ, భర్తని, అంతకర్కోటకంగా, దారుణంగా హత్య చేసిన ఆ ఘాతకులని పట్టించాలనీ, వాళ్ళకి శిక్ష వేయించాలనీ మీకు లేదా?" అడిగాడు.

"ఉన్నది – కాని"

"తెలుసు. చెపితే మీ ప్రాణానికి అపాయం. ఆ ఘాతకులని పట్టుకునేటంతవరకూ మీకు ఏ ఆపదా రాకుండా –"

"ఇంటికి పోలీసులని కాపలా పెడ్తారు కాపలా వున్న పోలీసు ఏం చేశాడు?" ఎదురు ప్రశ్న వేసింది కనకమ్మ.

"మిమ్మల్ని తాత్కాలికంగా జైలులో పెట్టిస్తాను. జైలులోకి ఎవరూ రారు. రాలేరు, వచ్చి మిమ్మల్ని హత్య చెయ్యలేరు" అన్నాడు యుగంధర్.

"ఏం చెప్పమంటారు? ఎలా?" అదిగింది కనకమ్మ తల వంచుకుని, "అవును, మొగాళ్ళతో చెప్పడానికి సిగ్గుగా వుంటుంది. అశ్లీలాలు, అసభ్యమైన విషయాలు. అయినా తప్పదు. సుమిత్ర, జయశ్రీలు కేవలమూ, సినిమా నటనవల్ల

డబ్బు సంపాదించేవారా? పుండరీకాక్షయ్య స్నేహితులు ఎవరు? ఆ యిద్దరు యువతులూ, అలా నగ్నంగా ఎందుకు పడుకున్నారు?" అడిగాడు యుగంధర్.

క్షణంపాటు కనకమ్మ సందేహిస్తూ వుండిపోయింది ."అవును, జయశ్రీ, సుమిత్రల సినిమా నటనవల్ల సంపాదన చాలా స్వల్పం. ఆ మాటకివస్తే అసలు సునీతకి సినిమా సంపాదనే లేదు. ఎలాగూ చెపుతున్నాను కనుక మీకు నిజం చెప్పేస్తున్నాను. జయశ్రీ నా కూతురు. పుండరీకాక్షయ్య నా భర్తకాదు మాది రాజమండ్రి దగ్గర ఊరు. పుదరీకాక్షయ్యతో మాకు పరిచయం అయింది. జయశ్రీని సినిమాలలో చేర్పిస్తానని తీసుకుని వచ్చాడు. కొన్ని సినిమాలలో చేర్పించాడు. మర్యాదకి, యిద్దర భార్యాభర్తలుగా నటించాలని చెప్పాడు. నాకు భర్తలేదు. మేము కళావంతులం. సినిమాలలో పైకి రావాలంటే శీలాన్ని గురించి పట్టింపు వుండకూడదని నచ్చచెప్పాడు పుండరీకాక్షయ్య. మాకూ అంత పట్టింపు లేదు. ఎవర్నెవరో తీసుకు వచ్చేవాడు. వాళ్ళు వచ్చే సమయానికి రాత్రి తను కుక్కని తీసుకుని, షికారుకి వెళ్ళేవాడు. తెల్లారగట్ట వాళ్ళు వెళ్ళే సమయానికి, మళ్ళీ కుక్కని తీసుకుని షికారుకి వెళ్ళేవాడు."

"డబ్బు యిచ్చి పుచ్చుకోడాలు."

"అవన్నీ ముందరే ఎక్కడో జరిగిపోయేవి."

"ఆ యిద్దరు యువతులు, నగ్నంగా"

"ఎవరు వచ్చినా జయశ్రీని కాని, సుమిత్రని కాని వొంటిగా వాళ్ళతో వుండనిచ్చేవాడు కాదు. అసలు అందుకే అనుకుంటాను, మేము యీ వూరు వచ్చిన రెండు నెలలకే, అంటే యీ వృత్తి యీ నగరంలో ప్రారంభించకముందే, పుండరీకాక్షయ్య సుమిత్రని తీసుకుని వచ్చాడు. ఎప్పుడూ యిద్దరు మొగాళ్ళు వచ్చేవారు. ఒకే పడకగది. జయశ్రీ, సుమిత్ర ఆ పడక గదిలో వుండేవారు. ఇద్దరు మొగాళ్ళు ఆ గదిలోకే వెళ్ళేవారు. క్షమించాలి. ఇంతకన్నా విపులంగా చెప్పలేను" అంది కనకమ్మ.

"అర్థమైంది. వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత, అలసిపోయిన ఆ యువతులు బట్టలు కట్టుకోకుండా అలాగే నిద్రపోయారన్నమాట?" అడిగాడు యుగంధర్.

తలవూపింది కనకమ్మ.

"మరొక ప్రశ్న. ఏ రోజుకి ఆ రోజు కొత్తవాళ్ళు వచ్చేవాళ్ళా వచ్చినవారే మళ్ళీ?"

"రెండూనూ. కొత్తవాళ్ళు వచ్చేవారు. పాతవాళ్ళు మళ్ళీ మళ్ళీ వచ్చేవారు."

"సంపాదించిన ఆ డబ్బు?"

"నాకే యిచ్చేవాడు – దాచమని, ఆ విషయంలో పుండరీకాక్షయ్యని ఏమీ అనలేను."

"సంపాదన ఏ మాత్రం వుండేది?"

"సగటున రోజుకి అయిదారు వందలు."

యుగంధర్ ఆశ్చర్యపోయాడు "చాలా ఎక్కువ కదూ" అడిగాడు.

"నేనూ అలాగే అనుకున్నాను, మద్రాసు మహానగరంలో అన్ని రేట్లతోపాటు యీ రేటు కూడా ఎక్కువ అని చెప్పాడు."

"ఇంకేమైనా చెప్పగలరా?" అడిగాడు యుగంధర్.

కనకమ్మ ఆలోచిస్తోంది, "భయపడకండి, దాచకండి" అన్నాడు యుగంధర్.

"ఏ రోజు, ఎవరు వస్తున్నారో పుండరీకాక్షయ్యకి ముందరే తెలుసు, అతనేగా ఏర్పాటు చేసేవాడు. ఒకరు వస్తోంటే ఒక చిన్న పొట్లం, యిద్దరు వస్తుంటే రెండు పొట్లాలు నా చేతికి యిచ్చేవాడు. ఆ వచ్చిన వాళ్లకి పాలల్లోనో దేంట్లోనో కలిపి యివ్వమనేవాడు."

ఆ పొట్లంలో ఏముండేది?"

"ఏదో తెల్లని పొడి, అంతా ఒక చిటిక కూడా వుండేది కాదు."

"అదేమిటని మీరు అడగలేదూ?"

"అడిగాను, చెప్పలేదు. పొరపాటునన్నా నన్ను, జయశ్రీ, సుమిత్రలని అది రుచి చూడవద్దని హెచ్చరించాడు. అది విషం కాదనీ, వచ్చినవాళ్ళు మళ్ళీ మళ్ళీ రావడానికి మందనీ చెప్పాడు."

"అంతేనా? ఇంకా ఏమైనా?"

"ఇంకేం చెప్పలేను. నాకింకేమీ తెలియదు" అన్నది కనకమ్మ.

"ఆ పొట్లం ఒకటి."

"నా దగ్గర లేదు. ఏనాడయినా అనుకున్న మనిషి రాకపోతే ఆ పొట్లం పుండరీకాక్షయ్య తీసుకునేవాడు."

"ఆ పొట్లంలో పొడి పాలల్లో కలిపి, ఆ మొగాళ్ళకి యిచ్చేవారా?"

"అవును."

"ఇస్తే వాళ్ళు ఏం చేసేవారు?"

"ముందు సామాన్యంగా వుండేవారు. గంటో గంటన్నరో తర్వాత సంతోషంగా నవ్వడం, ఎక్కడలేని ఆనందం వెలిబుచ్చడం. అంటే, అమ్మాయిలని శారీరకంగా ఎక్కువ కష్టపెట్టేవారు కారుట."

"అలాగా! చాలా ధన్యవాదాలు. మీకు ఎటువంటి ఆపదా రాకుండా, ఐ.జి ఆఫీసులోనే మీరు విడిగా ఉండే ఏర్పాటు చేస్తాను" అన్నాడు యుగంధర్.

అంటుండగా ఐ.జి సెక్రటరీ ఎక్స్టెన్షన్ టెలిఫోన్ తెచ్చి, ప్లగ్ చేసి, "మీకు అర్జంట్ కాల్ సార్" అన్నాడు.

"నేను రాజుని" అన్నాడు అవతలనించి.

"నువ్వు రాజువా! నాకు ఎలా తెలుసు?"

"మిల్క్ యీజ్ బ్లాక్. గ్లాసు తల్లక్రిందులవుతే."

"కోడ్ అంతేనా?"

"కోడ్ సరిగా లేదా?"

"ఉన్నది – చెప్పు"

"ఇంటర్‌పోల్ ఏజంటువద్ద ఒక మైక్రో ఫిలిం వున్నది."

"అలాగా నాకు ఆ విషయం తెలియదు. ఎవరూ చెప్పలేదు."

"ఆ మైక్రో ఫిలింలో వున్నది అబద్ధం. నిజమైన మైక్రోఫిలిం నావద్ద ఉంది" అన్నాడు రాజు.

"అలాగా – నువ్వు ఎక్కడున్నావు? ఆ మైక్రో ఫిలిం నీ చేతికి ఎలా వచ్చింది?" అడిగాడ్ యుగంధర్.

"ఆ వివరాలన్నీ చెప్పేందుకు యిప్పుడు వ్యవధిలేదు. ఎవరో వస్తున్నారు. వాళ్ళు వచ్చేలోపున. నేను ముఠాలో ఒకణ్ణిగా ఉన్నాను. నా ఆనవాలు తెలిస్తే అంతే. జాగ్రత్తగా వినండి .పూనమల్లీ హైరోడ్ మీద 16వ మైలు రాయి దగ్గర కారు ఆపి, కారు తలుపుకి ఆనుకుని నిలుచోండి, వెంటనే బయలుదేరండి. నేనూ, ఆ ముఠావాళ్ళతో అటు వెళ్తాను. వెళుతూ, అసలు మైక్రో ఫిలిం మీ వైపు గిరాటు వేస్తాను. అప్పుడు మీరు యీ ముఠాని పట్టుకోవచ్చు."

"రాజూ – నువ్వు."

డిస్కనెక్ట్ అయింది ఫోన్.

"మిల్క్ యీజ్ బ్లాక్. గ్లాసు తల్లక్రిందులయింది" అంటూ డాక్టర్ శ్రీకాంత్ పిస్తోలు రాజు మీదకి గురిపెట్టి "ఏమిటి నాటకం?" అడిగాడు.

"నాటకం ఏమీ లేదు. గ్లాసు తల్లక్రిందులైంది అనే ఊతపదం మా ప్రతి కోడ్‌కీ చెప్పాలి. అసలు కోడ్ చెప్పాను. ఆ విషయం మర్చిపోయాను" అన్నాడు రాజు. రాజు మనస్సులో ఆలోచనలు అడ్డదిడ్డంగా తిరుగుతున్నాయి. "మిల్క్ యీజ్ బ్లాక్" అంటే బలవత్కారంగా తనచేత ఎవరో చెప్పిస్తున్నారని అర్ధమవుతుంది .గ్లాసు తలక్రిందులయింది అని తను అప్పటికప్పుడు కలిపాడు. యుగంధర్ అందులోని అంతరార్థం గ్రహిస్తాడని గ్లాసు తలక్రిందులయింది అంటే, కోడ్ తలకిందులయిందని యుగంధర్ అర్ధం చేసుకుంటారా? తనని బెదిరించి అలా చెప్పమన్నారని గ్రహిస్తారా, చెప్పిన చోటికి వెళ్తాడా? వెళ్ళేటప్పుడు తగు జాగ్రత్త తీసుకుంటాడా? అన్నీ ప్రశ్నలే. యుగంధర్ మరణానికి తాను కారకుడు కాకూడదు. అవసరమైతే.

"అలా బొమ్మలా నిలుచుంటావేం? నిన్ను యిప్పుడేం చెయ్యను" అని చేతి గడియారం చూసుకుని, "ఇంకో అరగంటలో తేలుతుంది. మనవాళ్ళు బయలుదేరుతున్నారు" అన్నాడు శ్రీకాంత్.

"నేను?" అడిగాడు రాజు.

"నువ్వా! వినోదానికీ, విలాసానికీ వచ్చావుగా, లాలనతో వెళ్ళు. యుగంధర్ శవాన్ని మనవాళ్ళు తెచ్చారో నీకు డబ్బు చాలా యిస్తాను. బోనస్" అన్నాడు.

యుగంధర్ సిగరెట్ వెలిగించాడు. తనతో మాట్లాడినది రాజే. కోడ్ సరయిందే. మిల్క్ యీజ్ బ్లాక్. అంటే ఎవరో బెదిరిస్తున్నారన్నమాట. బలవంతాన అలా చెప్పవలసి వచ్చిందని ఊహించవచ్చు. అయితే కోడ్‌లో లేనిది. "గ్లాసు తల్లకిందులయింది" అని ఎందుకు అన్నాడు? దాని అర్థం ఏమిటి? ఏ గ్లాసు తల్లకిందులయింది? రాజు వొంటరిగా వుండివుంటే, తప్పకుండా మిల్క్ యీజ్ వైట్ అనేవాడు. అంతేకాదు, తమ రహస్య కోడ్ శత్రువులకి చెప్పవలసినంత ప్రమాదంలో యిరుక్కున్నాడన్నమాట. బహర్ నొక్కాడు. ఐ.జి. అసిస్టెంట్ రాగానే, "యింటర్ పోల్ ఏజెంటు వద్ద మైక్రో ఫిలిం ఏదయినా వుందా?" అడిగాడు.

"యస్ సర్."

"నాకెందుకు చెప్పలేదు?" అరిచాడు యుగంధర్.

"ఇప్పుడే, అయిదు నిమిషాల ముందు చూశారు. శవ పరీక్ష చేస్తున్నప్పుడు బూట్సులు విప్పారు. ఒక షూ హీల్ చూసి, యిన్ స్పెక్టర్ స్వరాజ్యరావుకి అనుమానం వేసి, హీలు వూడ పీకారు. అందులో వుంది చిన్న కేసెట్."

"మైక్రోఫిలింలో" అడుగుతున్నాడు యుగంధర్.

"తెలియదు సార్. ఇన్‌స్పెక్టర్ ఐ.జి కోడింగ్ నిపుణుడు, అందరూ డార్క్ రూములోకి వెళ్ళారు మిమ్మల్ని వెంటనే రమ్మన్నారు."

"సరే వెళ్తాను. కనకమ్మగారిని యిక్కడ, అంటే ఐ.జి. ఆఫీసులో వుండే ఏర్పాటు ఆమెకి ఎటువంటి ఆపదారాని ఏర్పాటు చేయంచండి" అని యుగంధర్ బయలుదేరాడు గదిలోంచి.

డాక్టర్ శ్రీకాంత్ ఎర్రని టెలిఫోన్ తీశాడు. "నెంబర్ ఒన్. చాలా ముఖ్యమైన పని. నువ్వు స్వయంగా పూనుకోవాలి. కావలసినంతమందిని తీసుకెళ్ళు.

డబ్బుకు వెనక తీయక. రెండు లారీలు, ఒక వాన్, రెండు కార్లు, ఒక జీపు, అన్నిటినీ ఏర్పాటు చెయ్యి. మనిషికి ఏదో యిస్తానని చెప్పి, మనకు ఎటువంటి సంబంధంలేని మనుష్యులని పోగుచేసి వాటిల్లో ఎక్కించు, వాటి మధ్య పాత – 1940 మోడల్ ఆస్టిన్‌కారు తీసుకుని వెళ్ళు. ఆ కారులో నువ్వు, నెంబర్ టూ తప్ప యింకెవరూ వద్దు. పూనమల్లి హై

రోడ్డుమీద 16వ మైలురాయి, అంటే కిలోమీటర్ రాయి ఏదో తెలుసుకో. అక్కడ క్రిజ్లర్ కారో, యింకో కారో ఆగి వుంటుంది.

డిటెక్టివ్ యుగంధర్ కారు బయట నిలుచుని వంటాడు. నిలుచున్నది డిటెక్టివ్ యుగంధరేనని ముందు, బైనాక్యులర్‌లోంచి దూరాన్నించే చూసి, నిశ్చయించుకో. తర్వాత బాగా దగ్గరికి వెళ్ళిన తర్వాత మెషిన్‌గన్ ఉపయోగించు. రైఫిల్, పిస్తోలు అయితే గురి తప్పవచ్చు. యుగంధర్‌ని షూట్ చెయ్యి. యుగంధర్ కారులో ఒక్కడే వుండకపోవచ్చు. ఏ పోలీసు ఆఫీసరో దాక్కుని వుండవచ్చు. జాగ్రత్త. ఎలా సాధిస్తావో? యుగంధర్ని అంటే యుగంధర్ శవాన్ని ఎత్తుకు రావాలి. అది సాధ్యం కాకపోతే, యుగంధర్ జేబులోనో, కూడా వున్న పోలీస్ ఆఫీసర్ వద్దో మైక్రో ఫిలిం కాసెట్ వుంటుంది. దాన్ని తీసుకురావాలి. యు మస్ట్ డూ దిస్" అని రిసీవర్ పెట్టేశాడు.

"అంత సులభమా! నడిరోడ్ మీద యుగంధర్ని కాల్చి చంపి, తర్వాత జేబులు వెతుకుతుంటే"

నవ్వాడు శ్రీకాంత్. "మా విషయం నీకింకా తెలియదు. మీ పోలీసులు రైఫిల్స్ పట్టుకుని కాపలా వుండగా, అరవై రెండు మంది యువతులని రాత్రికి రాత్రి ఎత్తుకు వచ్చాము. ఆ ఆపరేషన్‌లో కొంతమంది పోలీసులు మరణించారు. ఏం చేస్తాం? ప్రొఫెషనల్ రిస్క్. నమ్మవా? లాలన చూపిస్తుంది వెళ్ళు, వాళ్ళనందర్నీ" అన్నాడు డాక్టర్ శ్రీకాంత్.

"ఇది ఇంటర్‌పోల్ వారి కోడ్. దాన్ని డీ కోడ్ చెయ్యడం సులభం కాదు. ఇంటర్‌పోల్ వారినే అడిగితే" అన్నాడు కోడింగ్ నిపుణుడు.

"పోనీ ఏ విషయమో అదినా అర్థమైందా?" అడిగాడు ఐ.జి.

"ఐయాం సారీ సర్, సామాన్యమైన అంకెల కోడ్. అక్షరాల కోడ్ కాదు .గీతల కోడ్ కాదు. అంటే 1+2+4=6 యిలా వుంది .ఈ కోడ్ కి 'కీ' లేనిదే"

"అయితే టయిం వృధా చెయ్యడం దేనికి – యింటర్‌పోల్‌ని ఎలాగూ కంటాక్టు చేశాము, వస్తారు" అన్నాడు ఐ.జి.

"మీతో విడిగా మాట్లాడాలి" అన్నాడు యుగంధర్ ఐ.జి.తో.

"నిరభ్యంతరంగా రండి" అని తన గదిలోకి తీసుకుని వెళ్ళాడు. యుగంధర్ ఐ.జి.కి చెప్పాడు. తనకీ రాజుకీ జరిగిన సంభాషణ వివరాలు.

"మీరు వెళుతున్నారా?" అడిగాడు ఐ.జి.

"అవును."

"చాలా ప్రమాదం. టెలిస్కోపిక్ రైఫిల్స్‌తో" అంటున్నాడు ఐ.జి.

"ప్రమాదం లేకుండా జాగ్రత్తపడతాను. పూనమల్లి హై రోడ్ మీద 16వ మైలు రాయి దగ్గర కారు ఆపి నిలుచుంటాను. నా కారులో టూవే ట్రాన్స్మిటర్ ఏర్పాటు చేయించండి. మీకు అభ్యంతరం లేకపోతే యిన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుని కూడా తీసుకుని వెళ్తాను. నన్ను షూట్ చేస్తారు. చేస్తారని నాకు తెలుసు. తర్వాత మైక్రో ఫిలిం కాసెట్ కోసం వస్తారు. వచ్చిన వాళ్ళు ఎంతమందో వారి చేతుల్లో ఏం ఆయుధాలున్నాయో వాటిని బట్టి, అప్పుడు ఏం చేయాలో నిర్ణయిస్తాను. మీరు"

"నేను ఏం చెయ్యాలి?"

"పోలీసు బలగం ఒకరు యిద్దరు కాదు. రెండు మూడు వాన్‌ల నిండా సాయుధ పోలీసులు, పోలీసు వాన్‌లలో కాక, యితర రవాణాలలో, లారీలు లాటివి యూనిఫాం లేకుండా పంపండి. నన్ను షూట్ చెయ్యగానే, టూవే రేడియోలో యిన్‌స్పెక్టర్ ఆ విషయం చెబుతారు. చెప్పిన తర్వాత, ముందుకెళ్ళే వాహనాలు ఆపి, వాటిలో వున్న మనుష్యులని కస్టడీలోకి తీసుకోండి."

"మిమ్మల్ని షూట్ చేస్తే"

నవ్వాడు యుగంధర్. "బెంగ నా గురించి కాదు. రాజుని గురించి. రాజుకి ఏ ఆపదా రాకుండా చూడాలి. వస్తాను. ఇంటికి వెళ్ళి, అక్కణ్ణించి బయలుదేరతాను. బయలుదేరేముందు ఫోన్ చేస్తాను. మీ ఏర్పాట్లు మీరు చెయ్యండి" అని యుగంధర్ తలుపు దాటుతున్నాడో లేదో టెలిఫోన్ మోగింది.

క్షణం ఆగాడు. "మీకే యుగంధర్" అన్నాడు ఐ.జి.

"హల్లో యుగంధర్ హియర్. యస్ రాజూ ఏమిటి? నువ్వు చెప్పినట్లు వస్తున్నాను."

"మిల్క్ యీజ్ వైట్ సర్. గ్లాసు తల్లకిందులయింది" అన్నాడు రాజు.

"అంటే నన్నేం చెయ్యమంటావు?"

"మీ యిష్టం" డిస్కనెట్ అయింది టెలిఫోన్.

యుగంధర్ సందిగ్ధంలో పడ్డాడు. ఏమిటి అర్థం? మిల్క్ యీజ్ వైట్ అన్నాడు. అంటే తమ కోడ్ ప్రకారం ఎవరూ లేరు. తన దగ్గర అయితే విపులంగా చెప్పవచ్చుగా. అసలు కీలకం గ్లాసు తల్లకిందులయింది అనే మాటలలో వుంది. కోడ్‌లో లేనిది కలిపాడు. అంటే మిల్క్ యీజ్ బ్లాక్ అన్నప్పుడు మిల్క్ యీజ్ వైట్ అన్నప్పుడు రెండు సందర్భాలలో రాజు వొంటిగా లేడు.

ఆల్‌రైట్ దిగితేకాని లోతు తెలియదు అంటారు.

"వస్తాను."

"గుడ్‌లక్" అన్నాడు ఐ.జి.

## ( కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments